
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 సిద్దిపేట
మంగళవారం 20 మే 2025



లిక్కర్ ఆదాయం రూ.51 కోట్లు

● పెరిగిన ధరల ప్రభావం

● బీర్లు, బ్రీజర్లు ధరలు యథాతథం



సిద్దిపేట క్రైం, మే19 (ఆంధ్రజ్యోతి): పెరిగిన లిక్కర్ ధరలతో జిల్లాకు దాదాపు 51 కోట్ల ఆదాయం సమకూరనుంది. జిల్లాలో మొత్తం 93 మద్యం దుకాణాలు, 15 బార్లు ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1049841 లిక్కర్ కేసులు అమ్ముడుపోయాయి. ఒక్కో కేసులో 12 ఫుల్ బాటిళ్లు, 24 ఆఫ్ బాటిళ్లు, 48 క్వాటర్ సీసాలుంటాయి. ప్రస్తుతం పెరిగిన ధరలతో ఒక్కోకేసుపై రూ.480 ఎక్కువగా వస్తున్నాయి. దీని ప్రకారం జిల్లాలో సంవత్సరానికి సుమారు రూ. 51కోట్ల వరకు అదనపు ఆదాయం సమకూరనున్నది. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో ప్రభుత్వం బీర్ల ధరలు పెంచింది. లైట్ బీరు, స్ట్రాంగ్ బీరుపై రూ.30, బడ్వైజర్‌పై రూ.40 పెంచింది. ప్రస్తుతం మళ్లీ లిక్కర్ ధరలు పెంచడంతో మద్యం ప్రియులపై భారం పడనుంది. గతంలో బీర్ల ధరలు పెంచడం వలన జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో అమ్మకాలు తగ్గాయి. ప్రభుత్వం 2023 మే నెలలో మద్యం ధరలను క్వాటర్‌కు రూ.20 పెంచింది. అయితే మళ్లీ రెండు రోజుల్లో ఆ పెంపును రూ.10కి తగ్గించింది. మళ్లీ ఇప్పుడు క్వాటర్ పై రూ.10 పెంచింది. మద్యం ప్రియులు ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



పూల సోయగం

ఆ ప్రాంతానికి రాగానే వాహనదారులకు రోడ్డుకు ఇరువైపులా పూల చెట్లు స్వాగతం పలుకుతున్నట్లుగా కనువిందు చేస్తుంటాయి. వేసవిలో చెట్ల ఆకులు ఎండిపోయి రాలిపోతుంటాయి. కానీ ఇక్కడ రోడ్డుకి ఇరువైపులా నాటిన చెట్లకు వేసవిలోనే పూలు పూస్తాయి. దుద్దెడ నుంచి మర్పడగ మీదుగా తొగుటకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. అవి పెరిగి ఎర్రటి పూలతో సింధూరంలా ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

- కొండపాక, మే 19 (ఆంధ్రజ్యోతి)



ఉమ్మడి జిల్లాలో ఏసీపీలు, డీఎస్పీల బదిలీ

● తక్షణమే విధుల్లో చేరాలని డీజీపీ ఆదేశం

సంగారెడ్డి క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలోని డీఎస్పీలు బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 77 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ జితేందర్ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. మెదక్ జిల్లాలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, సిద్దిపేట జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్ ఏసీపీలు మధు, పురుషోత్తమ్‌రెడ్డికి స్థానచలనం కలిగింది. హుస్నాబాద్ ఏసీపీగా ఉన్న వి.సతీష్‌ను డీజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. సిద్దిపేటలోని సీసీఎస్‌లో ఉన్న ఏసీపీ ఎ.యాదగిరి హైదరాబాద్‌లోని గాంధీనగర్ ఏసీపీగా బదిలీ అయ్యారు. బదిలీ అయిన డీఎస్పీలు వెంటనే వారి స్థానాల్లో చేరాలని డీజీపీ ఆదేశించారు.

నూతన డీఎస్పీలు వీరే...

సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్ డీఎస్పీగా సైదా (ప్రస్తుతం నల్గొండ డీసీఆర్‌బీ), పటాన్‌చెరు డీఎస్పీగా ప్రభాకర్ (ప్రస్తుతం హైదరాబాద్ కంట్రోల్‌రూమ్) నియమితులయ్యారు. మెదక్ జిల్లా తూప్రాన్ డీఎస్పీగా నరేందర్‌గౌడ్ (ప్రస్తు తం రాచకొండ కంట్రోల్‌రూమ్), సిద్దిపేట జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్ ఏసీపీలుగా రవీందర్‌రెడ్డి (ఇంటెలిజెన్స్ విభాగం), నర్సింహులు నియమితులయ్యారు.

పిడుగుతో పైలం

● ఉమ్మడి జిల్లాలో వింత వాతావరణం

● ఉరుములు, మెరుపులతో పిడుగుపాట్లు 7

మోదం.. ఖేదం..

రూ.2కోట్లతో రిపేరు

రెండున్నరేళ్లకే కూల్చివేత

● 37 ఏళ్లు సేవలందించిన.. ప్రభుత్వ ఆసుపత్రి భవనం కూల్చివేతకు సిద్ధం

● దీని స్థానంలోనే 150 పడకల ఆసుపత్రి భవన నిర్మాణం

● మాతా శిశు ఆరోగ్య కేంద్ర ప్రారంభానికి ఏర్పాట్లు

హుస్నాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి) : రూ.కోట్లు ఖర్చు చేసి రెండున్నరేళ్ల క్రితం హుస్నాబాద్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి మరమ్మతులు చేయించారు. మంచి వసతులతో మెరుగైన వైద్యసేవలు అందుతాయని స్థానిక ప్రజలు భావించారు. ఈ క్రమంలో 30 పడకల నుంచి 150 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్వర్వులు ఇచ్చారు. దీంతో 37 ఏళ్లు సేవలందించి మరో 20 ఏళ్లు సేవలించేందుకు అవకాశం ఉన్నా కూడా ఆరోగ్య కేంద్ర భవనాన్ని కూల్చివేస్తుండడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేసిన రెండున్నరేళ్లకే కూల్చేసి దాని స్థానంలో నూతన ఆసుపత్రి భవనాన్ని నిర్మిస్తుండడంపై భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణానికి దూరంగా సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మిస్తే బాగుటుందని, ఈ భవన్నాన కూల్చి వేసే అవసరం ఉండదని పలువురు పేర్కొంటున్నారు.



కూల్చివేయనున్న 30 పడకల ఆసుపత్రి భవనం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మాతా శిశు ఆరోగ్య కేంద్రం

హుస్నాబాద్‌లో 30 పడకల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 6 ఫిబ్రవరి 1988న అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. నాటి నుంచి ఈ భవనంలోనే ప్రజలకు వైద్యసేవలందిస్తున్నారు. రెండేళ్ల క్రితం రూ.2కోట్లతో మరమ్మతులు చేయించి 2022లో డిసెంబర్ 5న మళ్లీ ప్రారంభించారు. ఈ ఆసుపత్రిని సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రంగా(సీహెచ్‌సీ) అప్‌గ్రేడ్ చేస్తూ మరో 20 పడకల ఆసుపత్రిని మంజూరు చేసి ఈ భవనం పక్కనే నిర్మించారు. ప్రస్తుతం పాత, కొత్త భవనాల్లో సేవలందిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో 50 పడకల మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేసి 2022లో శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయ్యాయి. మరో మూడు, నాలుగు రోజుల్లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మరో 150 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ రూ.82 కోట్లను మంజూరు చేయించారు. దీనిని పట్టణ శివారులో నిర్మాణం చేయాలని అనుకున్నారు. ప్రజలకు దూరం అవుతుందని, ప్రస్తుతం కొనసాగుతున్న 30 పడకల పాత ఆసుపత్రిని కూల్చేసి దాని స్థానంలో అన్ని కలిపి 250 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కూల్చివేతకు రూ. 8 లక్షలు మంజూరు అయ్యాయని తెలిసింది. మరో వారం రోజుల్లో కూల్చివేత కార్యక్రమం చేపట్టనున్నట్లు సమాచారం.

పాత ఆసుపత్రి కూల్చి వేస్తుండటంతో అందులో ఉండే విభాగాలన్నీ నూతనంగా నిర్మించిన మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోకి మార్చాలని ఆదేశాలిచ్చారు. ఇందులో ప్రసూతి సేవలు, జనరల్ వార్డు, స్కానింగ్ రూం, రోగుల వెయిటింగ్, రిజిస్ట్రేషన్, డ్రెస్సింగ్, డ్రగ్స్, వైద్యుల ఓపీ సేవలు, ఆయుష్ రూంలు, ఐసీటీసీ టెక్నీషియన్, ల్యాబ్ టెక్నీషియన్, ఎక్స్‌రే గది, టీబీ టెక్నీషియన్, కంప్యూటర్ రెడియోలజిస్టు గదులున్నాయి. దీంతో పాటు డయాలసిస్ సెంటర్ కూడా ఇందులోనే కొనసాగుతుంది. మాతా శిశు ఆరోగ్య కేంద్ర భవనంలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తే ఇబ్బందులుంటాయని, ప్రస్తుతం దీనిని ఎక్కడ ఏర్పాటు చేయాలనేది సందిగ్ధంగా మారింది.

అందుబాటులో లేని వైద్య నిపుణులు..

ఈ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం అప్‌గ్రేడ్ అవుతున్నా అందుకు తగినట్లుగా వైద్యనిపుణులు, సిబ్బంది లేకపోవడంతో రోగులకు సరైన వైద్య చికిత్సలు అందడం లేదు. వంద గ్రామాల కూడలిగా ఉన్న ఈ ఆసుపత్రిలో ప్రతిరోజు 300లకు పైగా ఓపీ, 40 మంది వరకు ఇన్‌పేషంట్లు, ప్రతినెలా 30 వరకు డెలివరీలు అవుతున్నాయి.

మిగతా 8లో..

ఒకే కుటుంబంలో ఐదుగురు అదృశ్యం

సిద్దిపేట క్రైం, మే19 (ఆంధ్రజ్యోతి) : సిదిపేట జిల్లా కేంద్రంలోని ఖాదర్‌పురకు చెందిన ఒకే కుటుంబంలోని ఐదురుగు కనిపించకుండాపోయారు. శనివారం ఉదయం నుంచి వీరి ఆచూకీ తెలియకపోవడంతో తప్పిపోయిన వ్యక్తి సోదరుడు వీరబత్తిని సంతోష్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖాదర్‌పురకు చెందిన వీరబత్తిని బాలకిషన్, అతని భార్య వరలక్ష్మి, కుమారుడు శ్రావణ్‌కుమార్, కుమార్తెలు కావ్య, శిరీషలు రెండు రోజుల క్రితం ఇల్లు వదిలి వెళ్లిపోయారు. వాళ్ల సెల్‌ఫోన్లు కూడా ఇంట్లోనే ఉన్నాయి. తన అన్న కుటుంబం బంధువుల ఇంటికి వెళ్లి ఉంటుందని రెండు రోజులు పాటు వెతికిన అతని తమ్ముడు వీరబత్తిని సంతోషకుమార్ చివరికి సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయి తే, బాలకిషన్‌కు అప్పులున్నాయి. అతనికి ఇచ్చేవారు ఇవ్వకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఇంట్లో నుంచి వెళ్లిపోతున్నట్లు లెటర్ రాసి పెట్టి కుటుంబం కనిపించకుండా పోయారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం సిద్దిపేట ఏసీపీ మధు, వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు కనిపించకుండా పోయిన వీరబత్తిని బాలకిషన్ ఇంటిని పరిశీలించారు. వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఏసీపీ తెలిపారు.



జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలు

సిద్దిపేట కల్చరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ స్విమ్మింగ్‌పూల్‌లో జిల్లాస్థాయి పురుషుల, మహిళల స్విమ్మింగ్ ఎంపికలు నిర్వహించారు. స్థానిక స్పోర్ట్స్ ఇన్‌చార్జి వెంకటేశ్వర శ్రీనివాస్ గౌడ్, స్విమ్మింగ్ పూల్ యాజమాన్యం, రాజలింగం, మహేష్, మహేష్ కుమార్, సిమ్మింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండి ప్రవీణ్ పోటీను ప్రారంభించారు. 90 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 50, 100, 200 మీటర్స్ విభాగంలో ఫ్రీ స్టైల్, బటర్ ఫ్లై, బెస్ట్ స్ట్రోక్, బ్యాక్ స్ట్రోక్ క్రీడల్లో పోటీలు నిర్వహించారు. మొదటి మూడుస్థానాల్లో నిలిచిన వారు ఈనెల 25న సికింద్రాబాద్‌లో రాష్ట్రస్థాయి క్రీడల్లో క్రీడాకారులు పాల్గొంటారు.

ప్రజావాణికి 69 దరఖాస్తులు

● ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్ మను చౌదరి



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్/చేర్యాల మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో భూ సంబంధిత, హౌసింగ్, ఆసరా పింఛన్ల ఇతర అర్జీలు మొత్తం 69 వచ్చాయని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి దోహదపడుతుందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి ద్వారా అదనపు కలెక్టర్లు గరీమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్‌తో దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్యా అధికారులు పాల్గొన్నారు.

● అక్బర్‌పేట-భూంపల్లి మండలం చౌదర్‌పల్లిలో సర్వేనెంబర్ 294లో లీజు తీసుకొని, ఆ భూమిని కబ్జా చేస్తున్నారని తిరిగి ఆ భూమిని మరల తమకు ఇప్పించాలని ఆ గ్రామ రైతులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆ భూమిని నమ్ముకొని తరతరాల నుంచి సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని చెప్పారు. ఇటీవల కొంత మంది వ్యక్తులు తప్పుడు లీజు పేరుతో కబ్జా చేసి మమ్మల్ని ఎక్కడికి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు. వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని సూచించారు.

● చేర్యాలలో అక్రమంగా కొనసాగిస్తున్న శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేశ్ తదితరుల కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. సీబీఎస్ఈ సిలబస్ లేకున్నా, శుభోదయ విద్యానికేతన్ పాఠశాలనే శ్రీచైతన్య పాఠశాలగా కొనసాగిస్తూ మోసం చేస్తున్నారని తెలిపారు. ఇష్టానుసారం ఫీజులు దండుకుంటూ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. డీఈవో శ్రీనివాస్‌రెడ్డి శ్రీచైతన్య యాజమాన్యానికి వత్తాసుపలుకుతూ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా పాఠశాలను మూసివేయాలని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న యాజమాన్యంతో పాటు చోద్యం వహిస్తున్న విద్యాశాఖాదికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనవెంట యాసిన్, అభినయ్ తదితరులున్నారు.

దేశాన్ని కాపాడాల్సింది యువతే

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



సిద్దిపేట క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలు మనదేశ భక్తి గురించి ఆలోచిస్తున్నాయని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన సందర్భంగా సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి లాల్‌కమాన్ వరకు నిర్వహించిన తిరంగా ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అమరులైన వీరజవాన్లకు సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ దేశాన్ని కాపాడాల్సింది మన యువతే అని చెప్పారు. మోదీ నాయకత్వంలో మేకలు కూడా పులుల వలే కొట్లాడుతాయని అనడానికి పహల్గాం ఘటన నిదర్శనమని చెప్పారు. మన దేశానికి ముప్పు వస్తుంటే మనం కూడా యూనిఫాం లేని సైనికుల వలే సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, వివిధ సంఘాల నాయకులు, పార్టీలకతీతంగా ప్రజలు పాల్గొన్నారు.

కనుల పండువగా విమాన రథోత్సవం



వర్గల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి వారి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహోత్సవాల్లో కీలక ఘట్టమైన స్వామి వారి విమాన రథోత్సవం సోమవారం కనుల పండువగా జరిగింది. అశేష భక్త జన కోలాహలం, మంగళవాయిద్యాలు, బోనాల ఊరేగింపు, కొయదొరల విన్యాసాలు హనుమాన్ స్వాముల జయజయ ధ్వానాల మధ్య స్వామి వారి విమాణ రథోత్సవం గ్రామ పురవీధుల్లో సాగింది. విద్యా సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని మెదక్ ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి ఎంపీ రాజేందర్ దర్శించుకుని పూజలు చేశారు.

రథోత్సవంలో ప్రముఖులు

వర్గల్ కేంద్రంలో జరిగిన శ్రీవేణుగోపాలస్వామి రథోత్సవానికి మెదక్ ఎంపీ రఘనందన్‌రావు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వంటిమామిడి ఏఎంసీ చైర్మన్ బాగనోల్ల విజయ మోహన్, గజ్వేల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మాజీ ఎంపీపీ లత రమేష్‌గౌడ్, పలువురు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

● డీఐఈఓ రవీందర్ రెడ్డి

సిద్దిపేట కల్చరల్, మే 19(ఆంధ్రజ్యోతి): ఈనెల22 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ-నిబంధనల అంశంపై సోమవారం సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, స్క్వాడ్ బృందాలు, కస్టోడియన్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం రెండో సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ఉంటాయన్నారు. వేసవి దృష్ట్యా సెంటర్లలో తగినన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఆదివారం కూడా పరీక్ష ఉంటుందన్న విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకునేలా తగిన సూచనలు చేయాలన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం డీఈసీ మెంటర్లు జ్యోతి, దేవయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమానికి పలు కళాశాలల ప్రిన్సిపాల్స్ హాజరయ్యారు.

లావణ్యకు కెమిస్ట్రీలో పీహెచ్‌డీ

పటాన్‌చెరు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధన విద్యార్థిని లావణ్య కె. డాక్టరేట్ అర్హత సాధించారు. బయోమాక్రోమోలిక్యూల్స్‌తో కూమరిన్ అనలాగ్‌లను బంధించడం, వాటి యాంటీ ఆక్సిడెంట్ అధ్యయనాలపై, బయోఫిజికల్ అంతర్చ ష్యలపై ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ బిజయ కేతన్ సాహూ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.

తూకంలో జాప్యంపై నిరసన

● రైతుల రాస్తారోకో
● సమస్య పరిష్కరించాలని డిమాండ్

శివ్వంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం సకాలంలో తూకం వేయలేదు. దీంతో రోజుల తరబడి రాత్రిపగలు కేంద్రం దగ్గర పడిగాపులు గాసే పరిస్థితి నెలకొందని అకాల వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తిన పీఏసీఎస్ సిబ్బంది అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి వెంటనే ధాన్యం తూకం వేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం తూప్రాన్ నర్సాపూర్ జాతీయా రహదారి శివ్వంపేట పీఏసీఎస్ కార్యాలయం ముందు రోడ్డుపై సుమారు 50 మంది రైతులు సుమారు అరగంట ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఘటన స్థలానికి ఎస్సై మధుకర్ రెడ్డి చేరుకుని అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. అనంతరం ఎమ్మెల్యే సునీత రెడ్డి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలతో రైతులకు ఇబ్బందులు కలగకుండా వెంట వెంటనే తూకం వేసి లిఫ్టింగ్ చేయాలని సీఈవో మధుయాదవ్‌కు ఆదేశించారు. సందర్భంగా రైతులు హనుమంతు,



రైతులను సముదాయిస్తున్న ఎస్సై మధుకర్ రెడ్డి

వెంకటేష్ సత్తయ్య లు మాట్లాడుతూ 20 రోజుల క్రితం తీసుకువచ్చిన ధాన్యాన్ని సకాలంలో తూకం వేయకపోవడంతో వర్షాలకు కళ్లంలో ధాన్యం తడుస్తుండడంతో ధాన్యం ఆరబెట్టినందుకు పడరాని పాట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. లారీల కొరతతో సొంత ట్రాక్టర్లలో రైస్ మిల్లుకు ధాన్యం తీసుకువెళ్తే నాలుగు సంచుల వరకు తరుగు తీసి రైతులకు నష్టం చేస్తున్నారని వాపోయారు. కలెక్టర్ స్పందించి కళ్లంలో ఉన్న ధాన్యం లిఫ్టింగ్ అయ్యేలా రైతులను మోసం చేస్తున్న రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు బిజిలీపురం కృష్ణ, వీరేశం, సుక్క కృష్ణ, నాగేష్, గోపాల్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

కురిసిన వర్షం తడిసిన ధాన్యం

కొల్చారం, మే 19 (ఆంధ్రజ్యోతి): కొల్చారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉన్న ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. రాంపూర్, కిష్టాపూర్ ఐకేపీ సెంటర్లో భారీగా ధాన్యం ఉండడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నారు. సోమవారం కురిసిన భారీ వర్షానికి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. లారీల కొరత పూర్తిగా ఉండడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే నిలువ ఉంచారు. ఇప్పటికైనా ఉన్నతాధికార స్పందించి రైతులను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలను పరిష్కరించండి

మెదక్ అర్బన్/ నర్సాపూర్/సంగారెడ్డి రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చే సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవానం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నులుమూలల నుంచి వచ్చిన ప్రజల తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు ఆర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో సమస్యలు పరిష్కరిస్తారని ఎంతో నమ్మకంతో ఇక్కడికి వస్తారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు. మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర ఫిర్యాదు చేశారు. జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని కొండాపూర్ మండలం మారేపల్లి గ్రామానికి చెందిన జంగయ్య ఆర్జీలో కోరారు. పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మెదక్ అర్బన్‌లో

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలపై దరఖాస్తులు స్వీకరించేందుకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ఆర్జీలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు.

ప్రజల నుంచి ఆర్జీలు స్వీకరిస్తున్న సంగారెడి కలెక్టర్ వల్లూరు క్రాంతి



న్యాయం చేయండి

రెండు ఎకరాలు తాకట్టు పెట్టి డబ్బులు తీసుకుంటే ఆ డబ్బులు కట్టలేదని తనకున్న నాల్గు ఎకరాలు తీసుకుని మోసం చేశాడని తనకు న్యాయం చేయాలంటూ ఓ గిరిజన వృద్ధురాలు జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణిలో సోమవారం మొరపెట్టుకుంది. బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం నర్సాపూర్‌లో నివాసముండే లకావత్ రుక్మిణీకి నాల్గు ఎకరాల భూమి ఉంది. అయితే నర్సాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి వద్ద 50వేలు తీసుకుని రెండు ఎకరాలు తాకట్టు పెట్టింది. సకాలలో కట్టకపోతే రెండు ఎకరాలు రిజిస్టర్ చేసుకుంటానని చెప్పి తన పేరిట ఉన్న 4ఎకరాల 28 గుంటల భూమిని రిజిస్టర్ చేసుకుని మోసం చేశాడని ఈ విషయమై పలు మార్లు అధికారుల వద్ద మొర పెట్టుకున్న న్యాయం జరగలేదని మీరైనా న్యాయం చేయాలని ప్రజావాణిలో మొరపెట్టుకుంది. ఈ విషయంలో ఆమె చిన్న కుమారుడు మనస్తాపం చెంది సరిగా తిండి తినక అనారోగ్యానికి గురై చనిపోయినట్లు పేర్కొంది.

వాటర్‌ట్యాంక్ ఎక్కి మహిళ హల్‌చల్

నర్సాపూర్, మే 19(ఆంధ్రజ్యోతి): చైతన్యపురి కాలనీకి చెందిన ఓ మహిళ వాటర్ ట్యాంకు పైకి ఎక్కి తనకు న్యాయం చేయాలంటూ లేకుంటే దూకుతా అంటూ హల్‌చల్ చేసింది. ఈ ఘటన సోమవారం జరిగింది. స్థానిక కాలనీకి చెందిన ఈశ్వరమ్మ అనే మహిళ పక్కింటి వారితో ఏదో విషయంలో గొడవ పడింది. ఈ గొడవ విషయంలో తనకు న్యాయం చేయాలని వారిపై చర్యలు తీసుకోవాలంటూ సమీపంలోని ట్యాంకు ఎక్కి దూకుతా అంటు మొండికేసింది. దీంతో సమాచారం పోలీసులకు తెలపడంతో వారు అక్కడకు చేరుకుని చాలా సేపు వరకు బతిమాలి తనకు తగిన న్యాయం చేస్తామని బుజ్జగించి కిందకు దిగేలా చేశారు. దీంతో అప్పటివరకు ఆందోళన చెందిన స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

గాలి దుమారంతో విరిగిపడిన చెట్లు

● ప్రయాణికులకు అంతరాయం

దుబ్బాక /చేగుంట, మే 19 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక, చేగుంటలో ఆదివారం కురిసిన ఈదురు గాలులకి చెట్లు విరిగిపోయి విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. చేగుంటలో ఆదివారం అర్ధరాత్రి కురిసిన గాలి దుమారానికి రోడ్డు పక్కన చెట్లు విరిగిపడి ప్రయాణికులకు తీవ్ర అంతరాయం కలిగింది. గమనించిన ప్రయాణికులు చెట్లను పక్కన తొలగించడంతో పెను ప్రమాదాలు తప్పాయి. సంబంధిత అధికారులు కనీసం విరిగిన చెట్లను తొలగించకపోవడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.



చేగుంట గజ్వేల్ రహదారిపై గాలి దుమారానికి రోడ్డుపై విరిగిపడిన చెట్లు

దుబ్బాకలో

దుబ్బాక పట్టణంలో ఆదివారం రాత్రి కురిసిన ఈదురుగాలులు, వర్షంతో చెట్లు నేలకూలాయి. విద్యుత్ వైర్లుతెగిపడి, విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దుబ్బాకపట్టణంలోని పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఆదివారం రాత్రి ఒక్కసారిగా వచ్చిన ఈదురుగాలులతో కూడా భారీ వర్షంతో దుబ్బాక బస్ డిపోనుంచి, దర్మాజీపేట వరకు పలు చెట్లు కూలిపోయాయి. సోమవారం ఉదయం వరకు రహదారి స్తంభించింది. దర్మాజీపేటకు చెందిన జనగాం చంద్రయ్య ఇంటిముందు ఉన్న వేపచెట్టు మహావృక్షం నెలకొరిగింది. ఈదురుగాలులకు వేర్లతోసహా కూలిపోయింది. కూలిన చెట్టు జనగామ చంద్రయ్య, జనగామ రాజవ్వ ఇంటిమీద పడింది. చెట్లు కూలడంతో దర్మాజీపేట రహదారి పూర్తిగా స్తంభించిపోయింది. మున్సిపల్ శానిటరీ అధికారి దిలీఫ్ ఆధ్వర్యంలో వెంటనే రహదారికి అడ్డంగా ఉన్న చెట్లను తొలగించారు. ఆదివారం పట్టణంలో విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. రామసముద్రం చెరువువద్ద, పలు చోట్ల విద్యుత్‌వైర్లు తెగిపోవడంతోపాటు, చెట్లు పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

దివ్యాంగురాలు కామారెడ్డి వాసి

రామాయంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): వారం క్రితం దారుణ హత్యకు గురైన దివ్యాంగురాలి వివరాలను పోలీసులు గుర్తించారు. ఆ మహిళ కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గురజాల గ్రామవాసి మణెమ్మ అని తేలింది. ఈ నెల 12 న తొనిగండ్ల శివారు రహదారి పక్కన ఆమెను బండరాయితో తలపై మోపి చంపిన విషయం తెలిసిందే. అయితే గుర్తుతెలియని మహిళగా పోలీసులు కేసు నమోదు చేశారు. హత్య జరిగిన నాటి నుంచి పలు కోణాల్లో దర్యాప్తు చేశారు. ఎట్టకేలకు వారం రోజులకు కానీ సదరు మహిళ వివరాలైతే రాబట్టారు. కానీ దుండగులు ఆమెను హత్య చేయడానికి గల కారణాలు ఏమిటి? హత్య చేసింది ఎవరు? అన్న మిస్టరీ మాత్రం ఇంకా వీడలేదు.

ఎస్‌ఎన్‌సీయూలోనే లభ్యమైన శిశువు

సంగారెడ్డి అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని నవజాత శిశు ఆరోగ్య కేంద్రం(ఎస్ఎన్‌సీయూ)లో లభ్యమైన ఆడ శిశువుకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 17 న ఎంసీహెచ్ పార్కింగ్‌లో 20 రోజుల ఆడ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి లభ్యమైన శిశువును ఎస్ఎస్‌సీయూ ఇంక్యూబేటర్‌లో పెట్టి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. శిశువు ఆరోగ్యంగా ఉందని, రెండు రోజుల తర్వాత శిశుగృహకు అప్పగిస్తామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.అనీల్‌కుమార్ తెలిపారు.



శిశువును పలకరిస్తున్న డా.అనీల్‌కుమార్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తూప్రాన్, మే 17(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి కరీంగూడ (రావెల్లి) సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందినట్లు తూప్రాన్ ఎస్సై శివానందం తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లింగాపూర్ గ్రామానికి చెందిన కొమ్ము జగన్ (32) బోరు రిపేరర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి తూప్రాన్ నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం లింగాపూర్ వెళ్తున్నాడు. మార్గమధ్యలో కరీంగూడ చౌరస్తా సమీపంలో మూల మలుపు వద్ద ఎదురుగా వెళ్లి మిషన్ భగీరథ సంప్ హౌజ్ ప్రహరీ గోడను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జగన్ అక్కడిక్కడే మృతిచెందాడు. కేసు నమోద చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తూప్రాన్ ఎస్సై శివానందం తలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కోహెడ, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూరేళ్ల గ్రామంలోని వడ్డెర కాలనీ సమీపంలో గల వ్యవసాయ బావిలో గుర్తు తెలియని మృతదేహం సోమవారం లభ్యమైంది. వడ్డెర కాలనీకి చెందిన సంపంగి దుర్గయ్య అనే వ్యవసాయ బావిలో మృతదేహం కనిపించింది. పంచాయతీ కార్యదర్శి బి సతీష్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు స్థానికుల సహాయంతో బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. ఇది ఎప్పుడు జరిగింది? చనిపోయిన వ్యక్తి ఏ గ్రామానికి చెందినవాడు అనేది నిర్ధారించవలసిన అవసరం ఉంది. ప్రస్తుతం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కారు ఢీ.. వ్యక్తికి గాయాలు

చేగుంట, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా కారు వచ్చి ఢీకొట్టింది.అతడికి తీవ్రమైన గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి చేగుంట మండల పరిధిలోని రెడ్డిపల్లి 44వ జాతీయ రహదారి బైపాస్ వద్ద జరిగింది. చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కారు డ్రైవర్ కారును అతివేగముగా నడుపుతూ రోడ్డు దాటుతున్న గుర్తుతెలియని ఒక వ్యక్తిని కారు ఢీకొనగా అతని తలకు కాళ్లకు గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ డిస్పెన్సరీలోనే

ఫేస్, థంబ్ వెరిఫికేషన్

● త్వరలో అందుబాటులోకి తెస్తామన్న ఆర్ఎం

సంగారెడ్డి అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు వైద్య చికిత్సలు పొందేందుకు సాంకేతికంగా ఎదురవుతున్న ఇబ్బందులు తొలగించేందుకు సంస్థ చర్యలు తీసుకుంది. ఇక నుంచి వారికి అందుబాటులో ఉండే ఆర్టీసీ డిస్పెన్సరీల్లోనే ఫేస్ అండ్ థంబ్ వెరిఫికేషన్ పరిశీలన ప్రక్రియ పూర్తి చేసేందుకు ఆర్టీసీ యాజమాన్యం వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు హైదరాబాద్ తార్నాక ఆర్టీసీ ఆస్పత్రిలోనే ఫేస్ అండ్ థంబ్ వెరిఫికేషన్ పరిశీలన సౌలభ్యం ఉండేది. ఈ క్రమంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు తార్నాక వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సంస్థ ఎండీ దృష్టికి ఉద్యోగులు తీసుకురావడంతో అందుబాటులో ఉన్న డిస్పెన్సరీలోనే ఫేస్ అండ్ థంబ్ వెరిఫికేషన్ చేసుకునే సౌలభ్యం కల్పిస్తూ ఉత్తర్వులు వెలువరించారు. కాగా సోమవారం ఆ ఉత్తర్వులను విశ్రాంత ఉద్యోగులు మెదక్ ఆర్ఎం ప్రభులతకు అందజేశారు. త్వరలో డిస్పెన్సరీలో ఫేస్ అండ్ థంబ్ వెరిఫికేషన్ ప్రక్రియను అందుబాటులోకి తెస్తామని ఆర్ఎం హామీ ఇచ్చినట్లు విశ్రాంత ఉద్యోగులు తెలిపారు. ఈ సందర్భంగా ఎండీ సజ్జనార్‌కు విశ్రాంత ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్ఎంను కలిసిన వారిలో రాష్ట్ర నాయకులు బి.మురళి, బీకే.మూర్తి, మురళి, బాల్‌రాజ్, సత్తయ్య, నాగేశ్వర్, దుర్గరాములు, లక్ష్మారెడ్డి, మల్లేశం, జాన్ తదితరులు ఉన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ప్రతిష్ఠాపనోత్సవాలు

● ఆలయానికి రూ.60 లక్షల విరాళం ప్రకటించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



తెల్లాపూర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తెల్లాపూర్‌లో వీరబ్రహ్మేంద్ర స్వామి ప్రతిష్ఠాపన ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి రూ.60 లక్షల విరాళాన్ని అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ మధుసూధనచారి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రవణ్‌కుమార్ బీఆర్ఎస్ పటాన్‌చెరు కో ఆర్డినేటర్ ఆదర్శరెడ్డి, రాంబాబు, నర్సింహరెడ్డి, ప్రవీణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి పడాలపల్లికి చెందిన పంబాల ప్రసాద్(15), నడిపల్లి యశ్వంత్(13), మొకద్దం రవికిరణ్ (12)లు శనివారం మధ్యాహ్నం గ్రామ శివారులోని పెద్ద కుంట వద్ద క్రికెట్ ఆడేందుకు వెళ్లారు. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం రావడంతో సమీపంలో ఉన్న చింత, మామిడి చెట్ల వద్దకు వెళ్లారు. ఒక్కసారిగా పెద్దశబ్దంతో వారు నిలబడిన చెట్టుపై పిడుగుపడటంతో ప్రసాద్, యశ్వంత్ అక్కడికక్కడే మృతి చెందారు.

సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం గౌడ్‌గాంజన్‌వాడలో రైతు పుండ్లిక్ పటేల్ తన పొలంలో సోమవారం ఎద్దును మేపుతున్నాడు. ఒక్కసారిగా పిడుగుపడడంతో రూ.80 వేల విలువ చేసే ఎద్దు మృతిచెందింది.

ఉమ్మడి మెదక్ జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలకు మనుషులతో పాటు మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. రానున్నది వర్షాకాలం పిడుగుపాటుకు బలి కాకుండా కొన్ని జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నది.



పిడుగుతో పైలం

ఉమ్మడి జిల్లాలో వింత వాతావరణం

ఉరుములు, మెరుపులతో పిడుగుపాట్లు

ఇటీవల ఇద్దరు బాలురు మృతి

మూగజీవాల మృత్యువాత

రైతులు, వ్యవసాయ కూలీలు జాగ్రత్త

మెదక్ కల్చరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో భిన్న వాతావరణ పరిస్థితులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు తోడు భయంకరమైన శబ్దాలతో అక్కడక్కడ పిడుగులు కూడా పడుతున్నాయి. అజాగ్రత్తగా ఉంటే పిడుగుపాటుతో నిండుప్రాణాలు బలవుతాయి. అతేకాకుండా ఆరుబయట ఉండే మూగజీవాలకు ఎక్కువ ప్రమాదం పొంచి ఉన్నది. పిడుగల ధాటికి మూడు రోజుల క్రితమే సిద్దిపేట రూరల్ మండలం సీతారాంపల్లిలో ఓ రైతు తన పొలం వద్ద కట్టేసిన గేదెలపై పిడుగు పడడంతో రూ.70వేలు విలువ చేసే పాడి గేదె మృతిచెందింది. రానున్న వర్షాకాలంలో పిడుగు పాటుతో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా అప్రమత్తతతో వ్యవహరించాల్సిన అవసరమున్నది.

ఉరుములు, మెరుపుల వేళ జాగ్రత్తగా ఉండాలి

● మబ్బులు పట్టి ఉరుములు, మెరుపులు సంభవిస్తున్న వేల వ్యవసాయ పనులు చేసే రైతులు, కూలీలు అప్రమతంగా ఉండాలి. ఆ సమయంలో చెట్ల కిందకు, విద్యుత్ టవర్‌లు, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరకు అస్సలు వెళ్లవద్దు.

● ఆరుబయట సెల్‌ఫోన్లలో మాట్లాడడం, వినియోగించడం చేయవద్దని నిపుణులు సూచిస్తున్నారు. వీలుంటే సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ చేయాలి. ఎలక్ట్రానిక్ వస్తువులకు దూరంగా ఉండాలి.

● వర్షం పడుతున్నప్పుడు చెట్ల కిందకు వెళ్లకూడదు. లోహపు భాగాలను తాకకుండా ఉండాలి. పొలం దున్నడం, పొలంలో ఇతర పనులను చేయడం వంటివి చేయకూడదు. వాన వస్తున్నప్పుడు బహిరంగ ప్రదేశాల్లో నిలిచిపోయి, ఎటూ వెళ్లలేని పరిస్థితి ఉంటే మోకాళ్లపై కూర్చొని, రెండు చెవులు మూసుకోవడం శ్రేయస్కరం. పిడుగు పడే అవకాశాలు ఉన్నాయన్నపుడు రబ్బర్ చెప్పులు వేసుకోవడం మంచిది.

● మూగజీవాలను పొలాల్లో, ఆరుబయట, చెట్లకింద అస్సలు విడువకూడదు. గేదెలు, ఆవులు, ఎద్దులను పాకలో కట్టేయడం శ్రేయస్కరం. హఠాత్తుగా వర్షాలు పడినప్పుడు గొర్రెలు, మేకలను కాపర్ల చెట్ల కిందకు అస్సలు తీసుకెళ్లవద్దు. విద్యుల్ లైన్‌ల కింద, ఎలక్ట్రిక్ పోల్‌లు, తాటి చెట్ల వద్ద మందలను ఆపకూడదు.

పిడుగుపాటు అంటే..

అయస్కాంతంలో ఉత్తర, దక్షిణ ధ్రువాలు ఆకర్షించుకున్నట్లుగానే రెండు మేఘాలు దగ్గరగా వచ్చినప్పుడు పాజిటివ్, నెగటివ్ కణాలు ఆకర్షించుకుని ఆకాశంలో మెరుపులు వస్తుంటాయి. ఈ సమయంలో మేఘాల్లోని నెగటివ్ కణాలను భూమిలోని పాజిటివ్ కణాలు ఆకర్షిస్తుంటాయి. అప్పుడు మెరుపుతో పాటు పిడుగు భూమిని తాకుతుంది. పిడుగు పడినప్పుడు 300 మిలియన్ వాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. 30 వేల డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత విడుదలవుతుంది. గంటకు లక్షకుపైగా కిలోమీటర్ల వేగంతో భూమిని చేరుతుంది. భూమిపై ఎత్తుగా ఉండే గుడి గోపురాలు, చెట్లు, గుట్టలు, సెల్ టవర్లు, విద్యుత్ స్తంభాలపై పిడుగు పడుతుంది.

ఘనంగా ఎడ్లబండ్ల ఊరేగింపు

పెద్దశంకరంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మక్త లక్ష్మాపూర్‌లో మాణిక్ ప్రభు జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం అంగరంగ వైభవంగా ఎడ్లబండ్ల ఊరేగింపును నిర్వహించారు. రంగురంగుల చమ్‌కీలు, పేపర్లు, వస్త్రాలు, మామిడికొమ్మలతో అలంకరించిన ఎడ్లబండ్లను గ్రామంలోని పురవీధుల గుండా డప్పుచప్పులతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మాణిక్ ప్రభు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



మక్తలక్ష్మాపూర్‌లో నిర్వహిస్తున్న ఎడ్లబండ్ల ఊరేగింపు

కేతకీలో మహారాష్ట్ర న్యాయాధికారి పూజలు

ఝరాసంగం, మే19 (ఆంధ్రజ్యోతి) : ఝరాసంగంలోని శ్రీకేతకీ సంగమేశ్వర స్వామిని సోమవారం మహారాష్ట్రలోని అమరావతి జిల్లాకు చెందిన దర్యాపూర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఓం శంకర్‌పాటిల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ఈవో శివరుద్రప్ప సన్మాంచి, తీర్థప్రసాదాలు అందజేశారు.



ఇది స్పెషల్ సమ్మర్ క్యాంపు

'డిజిటల్ డిటాక్స్ డ్రైవ్'తో వినూత్న ప్రయోగం

స్ర్కీన్‌లను మరిచేలా పాత ఆటలతో హుషారు

21 రోజులు.. 21 శిక్షణ కార్యక్రమాలు

చాంద్‌ఖాన్‌మక్తలో ఉపాధ్యాయుల చొరవ

గజ్వేల్/వర్గల్, మే 19 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ యుగంలో పాతకాలపు ఆటలన్నింటినీ పిల్లలు మరిచిపోయారు. పుట్టిన పాప నుంచి వృద్ధుల వరకు డిజిటలైజేషన్‌కు అలవాటు పడిపోయారు. సెల్‌ఫోన్ లేనిదే పాప పాలు తాగడం లేదు.. బాబు తినడం లేదు. కాసేపు ఇంట్లో కూర్చున్న సమయంలో సైతం టీవీ లేనిది ఉండడం లేదు. ఉదయం నుంచి మొదలు పెడితే రాత్రి పడుకునే వరకు డిజిటల్ పరికరాలతో కాలం గడిపేస్తున్నాం. పెద్దలు, పిల్లలు అందరూ వాటికే అలవాటైపోతున్నారు. దీంతో మానసిక ప్రభావం పడే ప్రమాదం ఉంది. వేసవి సెలవుల్లో పిల్లలను కనీసం పాత కాలపు ఆటలు తెలిసేలా, పుస్తకాల వైపు మళ్లించడం కోసం వర్గల్ మండలం చాంద్‌ఖాన్‌మక్త పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్ కుమార్ వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ప్రత్యేక సమ్మర్ క్యాంపును నిర్వహిస్తున్నారు. 21 రోజుల పాటు పిల్లలకు డిజిటల్ డిటాక్స్ డ్రైవ్ చేపట్టాడు. స్ర్కీన్ నుంచి అంటే ఫోన్, టీవీ లాంటి వాటి నుంచి దూరంగా ఉంచేందుకు ప్రయత్నం చేయగా విజయవంతమైంది. ఆరోగ్యకరమైన డిజిటల్ అలవాట్లను ప్రోత్సహించడంతో వారి మనసులో సామాజిక నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంగా ఈ విధానం పనిచేస్తుంది.



ఆటాలుడుతున్న విద్యార్థులు



డిటాక్స్ డ్రైవ్‌లో కార్యకలాపాలు

డిటాక్స్ డ్రైవ్‌లో భాగంగా అనేక కార్యకలాపాలను చేపట్టారు. స్ర్కీన్ రహిత రోజులు, బహిరంగ ఆటలు, క్రీడలు, కళ, సంగీతం, చేతిపనుల వర్క్‌షాప్‌లు, పఠన క్లబ్‌లు, మైండ్‌ఫుల్‌నెస్ సెషన్‌లను నిర్వహించారు. 21 రోజులుగా విద్యార్థుల మానసిక ఆరోగ్య స్థితిని మెరుగుపరచడానికి రోజుకు ఒక కార్యక్రమం చొప్పున 21 కార్యక్రమాలను చేపట్టారు. అవి ఫ్రీ హ్యాండ్ ఎక్సర్‌సైజ్, జంపింగ్ బాక్సెస్, సూర్య నమస్కారాలు, బ్రీతింగ్ వ్యాయామం, వాల్ పుషప్స్ బ్యాక్వర్డ్ రన్నింగ్, మంకీ వాక్, స్కిప్పింగ్, హలాల హంప్, ఫ్రాగ్‌రేస్, కంగారు జంపింగ్, బ్యాలెన్స్ స్టిక్ గేమ్, టో టచ్ ఎక్సర్‌సైజెస్, కూల్ డౌన్ ఎక్సర్‌సైజెస్, ఎలిఫెంట్ వాక్, బటర్‌ఫ్లై పోస్, క్రాస్ జంపింగ్, హై జంప్ హంలాహూప్ లాంటివి నేర్పిస్తున్నారు. వీటి ద్వారా విద్యార్థుల శారీరక మానసిక అభివృద్ధికి బాటలు వేయడం ప్రధాన ఉద్దేశం. డిజిటల్ డిటాక్స్‌తో మెరుగైన మానసిక ఆరోగ్యం, దృష్టి పెంపు, సృజనాత్మకత, సామాజిక పరస్పర చర్యలు, సంబంధాలు, ఆరోగ్యకరమైన నిద్ర వంటి లాంటి ప్రయోజనాలు చేకూరనున్నాయి.

సంతోషంగా ఉంది



నిజ జీవిత అనుభవాలతో సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని సమతుల్యం చేయడం, వాటి ప్రాముఖ్యతను గ్రహించడంలో డిజిటల్ డిటాక్స్ డ్రైవ్ సహాయపడింది. ఈ శిక్షణ శిబిరంలో పాల్గొనడం సంతోషంగా ఉంది. ఎంతో హుషారుగా పాల్గొంటున్నాం.

-చిందం శ్రీనిధి, ఐదో తరగతి

మానసిక, శారీరక ప్రశాంతత కోసం



బాధ్యతాయుతమైన సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని ప్రోత్సహిస్తూనే, విద్యార్థులను అవసరమైన జీవిత నైపుణ్యాలతో సన్నద్ధం చేయడమే మా లక్ష్యం. 21 రోజుల పాటు ఈ శిక్షణ శిబిరం సాగుతుంది. ఈ నెల 2 నుంచి 22వ తేదీ వరకు నిర్వహిస్తున్నాం.

- వరాల ప్రశాంత్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు

రికార్డులకెక్కిన బుడతడు

నడకలో జాతీయ, అంతర్జాతీయ ఘనత సాధించిన రెండేళ్ల బాలుడు

సంగారెడ్డి రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : బుజ్జివయసులోనే ఓ బుడుతడు జాతీయ, అంతర్జాతీయ రికార్డులను నెలకొల్పాడు. రెండేళ్ల ప్రాయంలోనే కిలోమీటర్ల కొద్దీ నడిచి వాహ్‌వా అనిపించాడు. పటాన్‌చెరుకు చెందిన అపురూప, సత్యనారాయణరెడ్డి దంపతులు కుమారుడు రుద్రాన్ష్‌రెడ్డి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతున్నాడు. రుద్రాన్ష్‌రెడ్డి 47 నిమిషాల్లో 3.23 కిలోమీటర్ల దూరం ఏకకాలంలో నడిచి ఇండియా బుక్ ఆఫ్ రికార్డును సొంతం చేసుకున్నాడు. గంట వ్యవధిలో 4.29 కిలోమీటర్ల దూరం నడిచి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మరో ఘనత సాధించాడు. ఏప్రిల్ 9న 4.29 కిలోమీటర్ల ఏకకాలంలో నడిచినందుకు ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రాండ్ మాస్టర్ టైటిల్‌ని సొంతం చేసుకోవడం మరో విశేషం. రుద్రాన్ష్ తాత నరేందర్‌రెడ్డి ప్రోత్సాహంతో ఇది సాధ్యమైంది. ఆయన ప్రతీరోజు ఉదయం, సాయంత్రం నడక ప్రాక్టీస్ చేయించి రికార్డులను సాధించేలా కృషి చేశారు.

అభినందించిన కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం రుద్రాన్ష్ రెడ్డి తల్లిదండ్రులు కలెక్టర్ వల్లూరు క్రాంతిని కలిసి బుడతడు సాధించిన రికార్డుల గురించి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రుద్రాన్ష్ తల్లిదండ్రులను, తాతయ్యను అభినందించారు. శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే పిల్లలు విజయాన్ని అందుకుంటారని అన్నారు. బాల్యదశ నుంచే వారిని తీర్చిదిద్దాలన్నారు.



రెండేళ్ల చిన్నారి రుద్రాన్ష్‌ను అభినందిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

పాషమైలారం పారిశ్రామికవాడలో విషాదం

● చార్మినార్ గుల్జార్ హౌజ్ ప్రమాదంలో మృతిచెందిన వారిలో తను పెట్రో కేమ్ కంపెనీ ఎండీ భార్య

● నివాళులర్పించిన కార్మికులు



రజనీ(ఫైల్)

పటాన్‌చెరు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆదివారం ఉదయం జరిగిన చార్మినార్ గుల్జార్ హౌజ్ ప్రమాదంలో పాశమైలారం పారిశ్రామికవాడలోని తను పెట్రో కేమ్ కంపెనీ ఎండీ వినోద్ భార్య రజనీతో పాటు కుటుంబసభ్యులు మృతిచెందడం విషాదాన్ని నింపింది. వినోద్ తన భార్య, కుమారుడితో కలిసి మూడు రోజుల క్రితం అత్తగారింటికి వెళ్లాడు. వినోద్ కుమారుడితో కలిసి శనివారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేయగా రజనీ మాత్రం అక్కడ ఉండిపోయారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం జరిగిన ఘోర ప్రమాదంలో వినోద్ భార్య రజినీతో పాటు రజనీ పుట్టింటికి చెందిన కుటుంబసభ్యులు దుర్మరణం పాలయ్యారు. వీరిలో రజనీ తండ్రి ప్రహ్లాద్ మోదీ, తల్లి మున్నీ, సోదరుడు పంకజ్, వదిన వర్ష, సోదరుని పిల్లలు అనన్య మోదీ, ఇదికా మోదీ, ఇరాజ్, సోదరి శీతల్ జైన్, శీతల్ జైన్ పిల్లలు రిషబ్ జైన్, ఆరుషి జైన్ ఇతర కుటుంబ సభ్యులు ఉన్నారు. గతంలోనే తను పెట్రో కెమ్ పరిశ్రమను విక్రయించడంతో ఇందులో పని చేసే పలువురు కార్మికులు వివిధ పరిశ్రమలలో పని చేస్తున్నారు. ఎండీ భార్య రజినీతో పాటు కుటుంబసభ్యులు పరిశ్రమ కార్మికులతో మంచి సంబంధాలు కలిగి ఉండేవారు. వారి మృతితో కార్మికులంతా తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం పారిశ్రామికవాడలో రజినీ చిత్రపటానికి పూలమాల వేసి కార్మికులు నివాళులర్పించారు. మంచి వ్యక్తిత్వం గల రజిని మృతి తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని పరిశ్రమలో హెచ్ఆర్ మేనేజర్‌గా పనిచేసిన యామిని తెలిపారు.

కబ్జాలు చేస్తే ఊరుకునేది లేదు

● భూ అక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేస్తా

● కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక నియెజకవర్గంలో ప్రభుత్వ భూమిని ఎవరు కబ్జా చేయాలని చూస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్బర్‌పేట- భూంపల్లి మండలం చౌదర్‌పల్లి గ్రామంలో 294 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమిని కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. గతంలో ఎస్సీ కమిషన్ ద్వారా ప్రభుత్వం సేకరించిన భూమి ఎలా పట్టాగా మారిందని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఈ అక్రమాలు జరిగాయని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు అమ్మితే కొనుగోలు చేశామని చెబుతున్నారని తెలిపారు. గతంలోనే ఈ భూములపై సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్‌కు విన్నవించామని ఆయన పేర్కొన్నారు. ఎనెగుర్తి గ్రామంలోనూ పెద్దఎత్తున భూ కబ్జాకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌదర్‌పల్లి భూ అక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసి సమగ్ర విచారణ చేయిస్తామన్నారు. దోషులను శిక్షించేలా చర్యలు తీసుకోవాలని పేదల భూమి గుంజుకునే ప్రయతం చేస్తే కాంగ్రెస్ పార్టీ ఊరుకోదన్నారు. ధరణి ద్వారా జవాన్ భూమి మార్పిడి చేసి కబ్జా చేశారని, ఆ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వెంకటస్వామి గౌడ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

మార్డి పెద్దచెరువును పరిశీలించిన అధికారులు



కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, నీటిపారుదల శాఖ ఏఈ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కల్హేర్, మే 19(ఆంధ్రజ్యోతి) : కలెక్టర్, ఆర్డీవో ఆదేశాల మేరకు కల్హేర్ తహసీల్దార్ శివశ్రీనివాస్, నల్లవాగు ప్రాజెక్టు ఏఈ అలేఖ్యరెడ్డి సోమవారం కబ్జాకు గురైన మార్డి పెద్దచెరువును పరిశీలించారు. 'మార్డి పెద్దచెరువు కబ్జా.. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం కథనం ప్రచురితం కావడంతో కలెక్టర్ వల్లూరి క్రాంతి, నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తిలు స్పందించారు. కబ్జాకు సంబంధించిన పూర్తి వివరాలు అందజేయాలని, అలాగే చెరువు సర్వే పనులు ప్రారంభించి కబ్జాకు గురైన విషయాన్ని తేల్చాలని కల్హేర్ తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన, నీటిపారుదల శాఖ ఏఈతో కలిసి చెరువును సందర్శించారు. కబ్జాకు గురైన స్థలాన్ని స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. ఇదిలా ఉండగా మార్డి గ్రామానికి చెందిన పెద్దచెరువు ఆయకట్టు రైతులు కబ్జాకు గురైన విషయమై సోమవారం ప్రజావాణిలోనూ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు.

క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు షురూ

సంగారెడ్డి అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధర్యంలో అంతర్ జిల్లా క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు సోమవారం ప్రారంభమయ్యాయి. కొండాపూర్ మండలం సీహెచ్.కోనాపూర్ ఎంఎ క్రికెట్ గ్రౌండ్‌లో సంగారెడ్డి-ఏ, సంగారెడ్డి-బి జట్ల మధ్య మ్యాచ్‌ను నిర్వహించారు. సంగారెడ్డి-బి జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 43.3 ఓవర్లలో 220 పరుగులకు ఆలౌట్ అయింది. తర్వాత సంగారెడ్డి-ఏ జట్టు 16 ఓవర్లలలో 74 పరుగులకు ఆలౌట్ అయింది. సంగారెడ్డి-బి జట్టుకు 146 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం సంగారెడ్డి-బి రెండో ఇన్నింగ్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 24 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. మంగళవారం ఆట కొనసాగనున్నదని ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభం

తూప్రాన్, మే 19(ఆంధ్రజ్యోతి): 11వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని తెలంగాణ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో ఈ పోటీలను నిర్వహిస్తుండగా, మెదక్ జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధాకిషన్ హాజరై తొలిరోజు పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి శోభన్‌బాబు, తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అభిషేక్‌గౌడ్, ప్రధానకార్యదర్శి నవీన్‌కుమార్, కోశాధికారి రేణుక, సంయుక్త కార్యదర్శి రాజేందర్, జిల్లా అధ్యక్షుడు కొడిప్యాక నారాయణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



సాఫ్ట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో రాధాకిషన్

రాష్ట్ర ఉత్తమ ఐకేపీ సీసీగా సుధాకర్

కోహీర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐకేపీ కార్యాలయంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్(సీసీ)గా పనిచేస్తున్న సుధాకర్ రాష్ట్రంలోనే ఉత్తమ సీసీగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సుధాకర్‌ను ఇటీవల హైదరాబాదులోని ప్రగతిభవన్‌లో తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సుధాకర్‌ను సన్మానించి ప్రశంస పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ కోహీర్ ఐకేపీ ఏపీఎం సమ్మయ్య సహకారంతో మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ ద్వారా అందించే రుణాల పంపిణీలో టార్గెట్ కంటే అధికంగా చేయడంతో ప్రభుత్వం గుర్తించిదని తెలిపారు.

న్యూస్ బాక్స్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

సిద్దిపేట కల్చరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందడానికి వీలుగా కరపత్రాలను సోమవారం డీఐఈవో రవీందర్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సౌకర్యాలు, అందులో చేరడం వల్ల ప్రయోజనాలను వివరించారు. డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి మాట్లాడుతూ.. ఈ కళాశాలలో అడ్మిషన్ పొందాలనుకునేవారు కళాశాలలో దోస్త్ కోఆర్డినేటర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ పిట్ల దాస్, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ కె భాస్కర్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు రూ.లక్ష విరాళం



ఆర్థికసాయాన్ని అందజేస్తున్న హరీశ్‌రావు

నంగునూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలమాకులలో ముదిరాజుల ఆరాధ్య దైవం- పండుగ సాయన్న ముదిరాజ్, కోరివి కృష్ణస్వామి ముదిరాజ్ ల విగ్రహావిష్కరణలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని సోమవారం సంఘం ప్రతినిధులకు అందజేశారు. మహనీయుల ఆశయలను కొనసాగించడంతో పాటు వారి పోరాటం భావితరాలకు తెలియజేసేందుకు విగ్రహాలను ఏర్పాటు చేయాలని హరీశ్‌రావు వారికి సూచించారు.

తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలి

హుస్నాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలో మంగళవారం సాయంత్రం నిర్వహించే తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలని రిటైర్డు ఉపాధ్యాయులు గౌరిశెట్టి ప్రకాష్ కోరారు. సోమవారం రాత్రి హుస్నాబాద్‌లో జరిగిన తిరంగా ర్యాలీ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. హుస్నాబాద్ పట్టణంలోని ప్రతీ పౌరుడు ర్యాలీలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ గాడెపాక రవీందర్, బీజేపీ పట్టణ అధ్యక్షులు బత్తుల శంకర్ బాబు, నాయకులు తదితరులున్నారు.

పోచమ్మ దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

తొగుట, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని పోచమ్మను కోరుకున్నట్టు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. సోమవారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో పోచమ్మ ఆలయ ప్రతిష్ఠాపనోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వెంకటయ్యకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సోలిపేట సతీష్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు ఉన్నారు.

బుగ్గరాజేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు

సిద్దిపేట రూరల్,మే 19(ఆంధ్రజ్యోతి); నారాయణరావుపేట మండల కేంద్రంలోని బగ్గ రాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి దంపతులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్సీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మేడికాయ శ్రీనివాస్, రెడ్డి సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు దొంగల బాపురెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

కొండపాక, మే 19 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని మండలంలోని వెలికట్టలో సోమవారం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి అమ్ముల బాలనర్సయ్య ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బ్రిడ్జి పనుల పరిశీలన

చేర్యాల, మే 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాంధీచౌక్ వద్ద నత్తనడకన కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణం పనులను మునిసిపల్ కమిషనర్ నాగేందర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులలో నిర్లక్ష్యం వహించకూడదని కాంట్రాక్టు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాములు



ధూళిమిట్ట, మే 19 (ఆంధ్రజ్యోతి): డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని బైరాన్‌పల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కొలుపుల రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఎంఈవో మీనాంజనేయులు, పలువురు ఉపాధ్యాయులు రాములుకు శుభాకాంక్షలు తెలిపారు.

యథేచ్ఛగా ఇటుక బట్టీల నిర్వహణ..!

- అనుమతులు లేకుండానే వ్యవసాయ భూముల్లో ఏర్పాటు
- ఉచిత విద్యుత్.. చెరువుమట్టి అక్రమ వినియోగం
- నిబంధనలు గాలికి
- కన్నెత్తి చూడని అధికారులు



రామంచలో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలు

చిన్నకోడూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): అక్రమ ధనార్జనే ధ్యేయంగా మండలంలో ఇటుకబట్టీలు యథేచ్ఛగా వెలుస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల అండతోనే కొందరు అక్రమార్కులు నిబంధనలకు విరుద్ధంగా బట్టీలను ఏర్పాటు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే..

పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా..

చిన్నకోడూరు మండలంలోని రామంచ, చంద్లాపూర్ గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే ఇటుక బట్టీలు వెలిశాయి. నిర్వాహకులు నిబంధనలు గాలికి వదిలేసి ఇష్టానుసారంగా ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తుండటంతో ఎక్కడ పడితే అక్కడ పుట్ట గొడుగుల్లా ఇటుక బట్టీలు వెలుస్తున్నాయి. ఇటుకబట్టీలను ఏర్పాటు చేయాలంటే వివిధ శాఖల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. సంపాదనే ధ్యేయంగా నిర్వాహకులు నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి నిర్వాహకులు గండి కొడుతున్నారనే ఆరోపణలున్నాయి.

ఉచిత విద్యుత్ వినియోగం..

ఇటుక బట్టీల నిర్వహణకు సంబంధిత శాఖల అనుమతులు తీసుకొని, వ్యవసాయేతర భూముల్లో ఇటుక బట్టీలు నిర్వహించాలి. కానీ ఈ నిబంధనలు పాటించకుండా వ్యవసాయ భూముల్లో బట్టీలను ఏర్పాటు చేసి, ఉచిత విద్యుత్‌ను వినియోగిస్తూ, ఇటుకల తయారీకి చెరువుల మట్టిని వినియోగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఏటా రూ. లక్షల్లో ఇటుకల వ్యాపారం జరుగుతున్నట్లు తెలుస్తోంది. సంబంధిత అధికారులకు ఇదంతా తెలిసినా అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ఇటుక బట్టీల నిర్వహణకు వ్యవసాయ భూములు వినియోగించరాదు. అలా వినియోగిస్తే ముందుగా నాలా కన్వర్షన్ చేసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటాం. చెరువులు, ప్రభుత్వ స్థలాల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

-హరికిరణ్ కుమార్, తహసీల్దార్

ఏడేళ్లు గడిచినా ఐటీఐ భవనం పూర్తి కాదా?



అసంపూర్తిగా నిర్మాణం వదిలేసిన ఐటీఐ భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

దుబ్బాక, మే 19 (ఆంధ్రజ్యోతి): దుబ్బాకలో ఏడేళ్ల క్రితం పనులు ప్రారంభించిన ఐటీఐ భవనాన్ని అసంపూర్తిగా ఎలా వదిలేశారని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మండిపడ్డారు. ఆగస్టులోపు భవన నిర్మాణం పూర్తిచేయలేకపోతే కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీ డిమాండ్ చేశారు. సోమవారం దుబ్బాక పట్టణంలో అసంపూర్తిగా వదిలేసిన ఐటీఐ భవనం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డిపై ఘాటుగా స్పందించారు. ఏడేళ్ల పాటు పనులు కాకుండా ఆగిపోయిన భవనాన్ని మీరే అధికారంలో ఉన్నా, ఎందుకు పూర్తిచేయించలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా మీ హయాంలోనే తప్పు జరిగిందని ఒప్పుకుని, సీఎంను కలిసి ఐటీఐ కళాశాల భవనాన్ని పూర్తిచేసేలా పని చేయాలని దుబ్బాక ఎమ్మెల్యేకు సూచించారు. అసంపూర్తిగా ఉన్న ఐటీఐ భవనం పక్కనే టాటా కన్సల్టెన్సీ ద్వారా నిర్మిస్తున్న శిక్షణ కేంద్రం పూర్తవుతుందని, దానికి అనుసంధానంగా ఉండాల్సిన ఐటీఐ భవనం పూర్తికాకుంటే ప్రయోజనం ఉండదన్నారు. ఈ ఆగస్టు వరకు భవనం పనులు పూర్తయితేనే విద్యార్థుల సమస్య తీరుతుందన్నారు. వెంటనే సాంకేతిక విద్యాశాఖ అధికారులు, కలెక్టర్ స్పందించి, చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు. ఎంపీ వెంట దిశ సభ్యులు సుంకు ప్రవీణ్, సుభాష్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, సంపంగి ఆశోక్, బాస్కర్ తదితరులున్నారు.

రైతులకు కరెంటు కష్టాల నుంచి గట్టెక్కించడమే లక్ష్యం



దౌల్తాబాద్:ముబ్బారస్‌పూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

దౌల్తాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): రైతులను కరెంటు కష్టాలనుంచి గట్టెక్కించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల శ్రావణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని ముబ్బారస్‌పూర్ గ్రామశివారులోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానికంలో ఏర్పాటు చేసిన 32.5 కేవీ ఎంపీపీ ట్రాన్స్ ఫార్మర్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మల్లేశంపల్లి మాజీ సర్పంచ్ దారా సత్యనారాయణ, కాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షుడు దశరథరెడ్డిల సూచన మేరకు ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సహకారంతో ఈ ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఆది బాలకృష్ణ,దుద్దెడ స్వామి,బుచ్చిరెడ్డి,షాదుల్లా, చారి, రాము, రవీందర్‌రెడ్డి,వెంకటేశం,ఎల్లం, ఆనందం పాల్గొన్నారు.

హరీశ్‌రావు చొరవతో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్

నంగునూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): నంగునూరులో లో వోల్టేజి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు సోమవారం మాజీమంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేశారు. కొంతకాలంగా చౌడు చెరువు కట్టపై ఉన్న 63 కేవీ ట్రాన్సాఫార్మర్‌పై లోడు సరిపోక తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. గ్రామ యువకులు ఈ విషయాన్ని హరీశ్‌రావుకు తెలపడంతో వెంటనే స్పందించి గంటలోగా ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసి, బిగింపు పనులు సైతం పూర్తి చేశారు. హరీశ్‌రావుకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

రసాయన ఎరువులను అవసరాన్ని బట్టి వినియోగించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త ఎస్ శ్రీదేవి

సిద్దిపేట రూరల్,మే 19 (ఆంధ్రజ్యోతి): యూరియా, రసాయనాల వాడకం అవసరాన్ని బట్టి వినియోగించాలని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ఎస్.శ్రీదేవి రైతులకు సూచించారు. సోమవారం సిద్దిపేట రూరల్ ఇర్కోడు గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన స్థానం తోర్నాలవారి అధ్వర్యంలో రైతులకు అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త ఎస్.శ్రీదేవి మాట్లాడుతూ రైతులు పంట వ్యర్థాలను కాల్చవద్దని, దుక్కిలో కలియదున్నడం వల్ల సేంద్రియ ఎరువుగా మారుతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువుల వాడకం, ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రాధిక, ఏడీఏ వైపద్మ, ఏవో నరేష్, సూడా చైర్మన్ రవీందర్ రెడ్డి, మండల పశు వైద్యాధికారి శ్రవణ్ కుమార్, శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

తొగుట, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ తోటల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి మోహన్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కాన్గల్ గ్రామంలో రైతు తరిగొప్పుల లక్ష్మీ కనకయ్య ఐదున్నర ఎకరాల్లో సాగుచేసిన ఆయిల్ పామ్ తోటను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయిల్ పామ్‌సాగులో అంతర పంటలుగా కూరగాయలు, బొప్పాయి, అరటి, పూలమొక్కలను పెంచి అధిక దిగుబడి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజేశ్, రైతులు కనకయ్య, లక్ష్మినారాయణ, లక్ష్మి పాల్గొన్నారు.

అక్రమ కార్యకలాపాలపై దృష్టి సారించాలి: సీఐ

బెజ్జంకి, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలపై పోలీసులు దృష్టి సారించాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను సూచించారు. సోమవారం బెజ్జంకి పోలీసుస్టేషన్‌ను ఆయన సందర్శించారు. సీఐ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

అవినీతికి నిలయంగా హుస్నాబాద్ ఎక్సైజ్ కార్యాలయం

హుస్నాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ ఎక్సైజ్ కార్యాలయం అవినీతికి నిలయంగా మారిందని భారతీయ కిసాన్ సంఘ్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. కార్యాలయానికి అధికారులు ఎప్పుడు వస్తారో ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్ హనుమాన్ భక్తులపై దాడి చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన బోధన

దౌల్తాబాద్,మే19 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆట పాటలతో కూడిన నాణ్యమైన బోధన అందిస్తామని దొమ్మాట జడ్పీ పాఠశాల హెచ్ఎం బాసిత్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దొమ్మాట హెచ్ఎం బాసిత్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందంతో కలిసి దొమ్మాటలో ఉపాధి హామీ పనుల కూలీల వద్దకు వెళ్లి బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. దొమ్మాట పాఠశాలలో నాణ్యమైన విద్య, సాంస్కృతిక విభాగాల్లో శిక్షణతో పాటు అన్నిరకాల క్రీడాంశాల్లో తర్ఫీదు ఇవ్వడానికి ఉపాధ్యాయులు నియమింపడ్డారన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

మద్దూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శంకర కంటి ఆస్పత్రి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కంటి ఆస్పత్రి టీం లీడర్ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 202 మందికి వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించినట్లు మద్దూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రజిత తెలిపారు. కంటి చూపుతో ఇబ్బందులు పడుతున్న 46 మంది గుర్తించినట్లు తెలిపారు. వీరికి శస్త్ర చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లద్నూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి మహేందర్‌తో పాటు ఆస్పత్రి సిబ్బంది, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

త్వరగా తూకం వేసి మిల్లుకు తరలించాలి



బండచేర్లపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్

సిద్దిపేట రూరల్,మే 19(ఆంధ్రజ్యోతి); అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి పోయే ప్రమాదం ఉన్నందున, నిర్ణీత తేమశాతం రాగానే తూకం వేసి మిల్లుకు తరలించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్ అధికారులను ఆదేశించారు. సోమవారం సిద్దిపేట రూరల్ మండలం బండచేర్లపల్లి గ్రామంలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో హమాలీలు సమస్యలను తెలుసుకుని జిల్లా సహకార అధికారి, తహసీల్దార్‌లతో మాట్లాడి హమాలీల సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో డీఎం సివిల్ సప్లయి ప్రవీణ్, జిల్లా సహకార అధికారి నాగేశ్వర్‌రావు, తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రాజేశం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం

- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మే 19 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని ప్యాక్స్ కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్ల వెంట వేల క్వింటాళ్ల వరిధాన్యం ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. మార్కెట్ యార్డులో ధాన్యం కుప్పలుగా ఉందని, బార్దాన్, లారీలు సమకూర్చడంలో పూర్తిగా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందని విమర్శించారు. తేమ శాతం సాకుగా చూపిస్తుండడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతుల దాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట నాయకులు మరికంటి కనకయ్య, రాజు, ప్రవీణ్, సాయిబాబ, ప్యాక్స్ సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ



మర్కుక్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో వెంకట్‌రాములు

మర్కుక్/కుకునూరుపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మర్కుక్, కుకునూరుపల్లి మండలాల పరిధిలో పనిచేస్తున్న వివిధ పాఠశాలల ఎల్ఎఫ్ఎల్, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని ఈ నెల 20 నుంచి ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు ఆయా మండలాల ఎంఈవోలు వెంకటరాములు, బచ్చలి సత్తయ్య పేర్కొన్నారు. మండలస్థాయిలో నిర్వహించే ఈ శిక్షణను ఆయా మండల కేంద్రాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ శిక్షణకు రిసోర్స్ పర్సన్స్‌గా పనిచేస్తున్నవారితో కలిసి ఎంఈవోలు వేర్వేరుగా సోమవారం సన్నాహక సమావేశాలను ఏర్పాటు చేశారు. సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులలో అభ్యాస సామర్థ్యాలు, నైపుణ్యాన్ని పెంచే విధంగా శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. శిక్షణ ఉదయం 9నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో హాజరు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మర్కుక్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తుమ్మ కుమార్, లయన్ రమణారావు పాల్గొన్నారు. అదేవిధంగా కుకునూరుపల్లిలో నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, అశోక్, శ్రీనివాస్, రాంచంద్రం, వెంకటరమణ, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెండున్నరేళ్లకే కూల్చివేత

(5వ పేజీ తరువాయి)

ప్రస్తుతం 50 పడకల ఆసుపత్రిగా ఉన్నా 30 పడకల ఆసుపత్రి సేవలు మాత్రమే అందుతున్నాయి. వైద్యుల్లో 16 మందికి ఆరుగురు మాత్రమే ఉన్నారు. 11 మంది స్టాఫ్ నర్సులకు 10 మంది, ముగ్గురు ఏఎన్ఎంలకు ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఫోరెన్సిక్ డాక్టర్, జనరల్ మెడిసిన్, జనరల్ అనస్తీషియా, రేడియోలజిస్టు, ఎక్సరే టెక్నిషియన్, ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 50 పడకల మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి సంబంధించి ఒక్క పోస్టు మంజూరు కాలేదు.

ట్రామా సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

హుస్నాబాద్ నుంచి నేషనల్ హైవే వెళ్తుండడంతో ఇక్కడ 50 పడకల ట్రామా సెంటర్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రతిపాదనలు పంపారు. ఇది త్వరలో మంజూరు అవుతుందని పేర్కొంటున్నారు. దీనిని ఈ ఆసుపత్రిలో నిర్మిస్తారా.? లేక పట్టణ శివారులో నిర్మిస్తారనేది వేచిచూడాలి.

వేచరేణిలో దొంగల హల్‌చల్

- 4 ఇళ్లలో నగదు, ఆభరణాలు.. రెండు ద్విచక్రవాహనాలు చోరీ



బీరువాను ధ్వంసం చేసిన దుండగులు

చేర్యాల, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేచరేణి గ్రామంలో ఆదివారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఒకే రోజు నాలుగిళ్లలో చొరబడి నగదు, ఆభరణాలు, ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడటం పట్ల గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేచరేణి గ్రామానికి చెందిన ఒంటరిమహిళ ఎగుర్ల యాదవ్వ ఆదివారం రాత్రి ఇంటికి తాళంవేసి చుట్టుపక్కనవారి ఇంట్లో నిద్రించింది. కూలీపనులు చేసుకుంటూ జీవిస్తున్న మేర్గోజు శశిరేఖ తమ కూతుళ్ల వద్దకు వెళ్లింది. రెండు ఇళ్లకు తాళాలువేసి ఉండటాన్ని గమనించిన దుండగులు ఆ ఇళ్లలోకి చొరబడి బీరువాలను ధ్వంసంచేసి వస్తుసామగ్రి ధ్వంసం చేశారు. యాదవ్వ ఇంట్లో 20తులాల వెండి పట్టగొలుసులు, ఒకటిన్నర తులాల బంగారు ఆభరణాలు, రూ. వేయి నగదును దోచుకున్నారు. మేర్గోజు శశిరేఖ ఇంట్లో పావుతులం బంగారం, రూ.10వేలు నగదును అపహరించారు. ఎగుర్ల ఎల్లయ్యకు చెందిన ప్యాషన్ ప్రో బైక్, ఎగుర్ల యాదయ్య ఎక్సెల్ మోపెడ్‌ను అపహరించుకుపోయారు. అలాగే పోలబోయిన స్వామి ఇంటి తాళాలు తీసి చోరీకి యత్నించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కొమురవెల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్



ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు

నంగునూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజగోపాల్‌పేట ఎస్ఐ అసిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన పొన్నాల ఎల్లయ్య, చామంతుల బాలరాజు అనే వ్యక్తులు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్లలో బస్వాపూర్ పెద్దవాగు నుంచి ఇసుకను నంగునూరు మండలంలోని సిద్ధన్నపేట వైపు తరలిస్తున్నారు. ఇది గమనించిన పోలీసులు బస్టాండ్ వద్ద పట్టుకొని తనిఖీ చేయగా ఎలాంటి అనుమతి పత్రాలు లేవని తెలిపారు. చర్యల కోసం నంగునూరు తహసీల్దార్‌కు సమాచారం అందించామని ఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ లో 25 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రహదారులపై ఇటీవల ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 25 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని సోమవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట కోర్టులో హాజరు పరచగా విచారణ అనంతరం రూ.53,500 జరిమానా విధించినట్టు సీఐ వివరించారు.

ముండ్రాయిలో వాహనాల తనిఖీ



కారులో తనిఖీ చేస్తున్న పోలీసులు

నంగునూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజగోపాలపేట పోలీస్ ఆధ్వర్యంలో ముండ్రాయి గ్రామంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ట్రైనీ ఎస్ఐ సౌజన్య ఆధ్వర్యంలో పలువురు వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్వర్ణోత్సవాల్లో చిన్నజీయర్ స్వామిజీకి ఘన స్వాగతం



చినజీయర్ స్వామిజీకి స్వాగతం పలుకుతున్న హరీశ్ రావు

సిద్దిపేట కల్చరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మోహినీపురలోని శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడానికి విచ్చేసిన చినజీయర్ స్వామిజీకి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారి దర్శనం చేసుకొని ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం మంగళవారం నిర్వహించే శ్రీ భూనీళా సమేత శ్రీనివాస కళ్యాణంలో భాగంగా సోమవారం రాత్రి ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చినజీయర్ స్వామిజీ భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ఉత్సవాల్లో భాగంగా మంగళ, బుధవారాల్లో ఉదయం పూట జరిగే తీర్థగోష్టిలో చినజీయర్ స్వామి పాల్గొంటారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

భూ నిర్వాసితులు అభ్యంతరాలుంటే తెలపాలి: ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మూర్తి

హుస్నాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం గౌరవెల్లి రిజర్వాయర్ ఎడమ కాలువ నిర్మాణంలోని కోహెడ మండలం నారాయణపూర్, నకిరెకొమ్ముల, వింజపల్లి గ్రామాల భూ నిర్వాసితులతో ఆర్డీవో రామ్మూరి సమావేశం నిర్వహించారు. కాలువ నిర్మాణంలో పోతున్న భూమి విస్తీర్ణం, నివాస గృహాలు, పైపులైన్లు, పశువుల కొట్టాలు, చెట్లు ఏవైనా ఉంటే తెలపాలని రైతులకు సూచించారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించారు. భూ సేకరణలో ఏవైనా అభ్యంతరాలుంటే తెలపాలన్నారు. ఈ కాలువ నిర్మాణంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ డీఈ రేష్మ, ఏఈ శ్రీనాథ్, డీటీవో అరవింద్, రాములు, ఎల్లయ్య తదితరులున్నారు.

28న కిడ్స్ అథ్లెటిక్స్ జిల్లాస్థాయి ఎంపికలు

సిద్దిపేట కల్చరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28న ఉదయం 8 గంటలకు స్థానిక స్టేడియం మైదానంలో అండర్ 8, అండర్ 10, అండర్ 12 బాలబాలికలకు ఎంపిక పోటీలు ఉంటాయని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, కర్రోళ్ల వెంకట స్వామి గౌడ్ తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో మొదటి మూడు స్థానాలు సాధించినవారికి ప్రశంసా పత్రాలతో పాటు పతకాలు, పాల్గొన్న వారికి ప్రశంసాపత్రం అందజేయబడతాయన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచినవారిని జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వీరు వచ్చే నెల 1న జింఖాన గ్రౌండ్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 27 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8501977079, 9704061543 నెంబర్లను సంప్రదించాలని కోరారు.